సాక్షి జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



ఆకుకూరలతో అధిక ఆదాయం

వేసవిలో ఆకుకూరల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాంబాబు తెలిపారు. - 8లో▸



స్వచ్ఛమైన పెట్రోల్ అందిస్తాం

జైళ్ల శాఖ ద్వారా స్వచ్ఛమైన పెట్రోల్, డీజిల్ అందిస్తామని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35.1⁰/19.2⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కల్యాణం.. కమనీయం



రేగొండ: కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రతీ నెలలో కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తారు. మంగళవారం అభిషేకంతో ప్రారంభమై, సుదర్శన నారసింహ హోమం కొనసాగించారు. అనంతరం కల్యాణం జరిపించారు. ఆరగింపుతో కల్యాణ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేష్, చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కత్తి వెంకటస్వామి, ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

నాగేపల్లిలో వైద్యశిబిరం



కాళేశ్వరం: కాళేశ్వరం పీహెచ్‌సీ పరిధిలోని అన్నారం సబ్‌సెంటర్‌లోని నాగేపల్లిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం 38మందికి వైద్య పరీక్షలు చేశారు. 14 మంది రక్తనమూనాలు సేకరించి మలేరియా రాపిడ్ టెస్టులు చేసి మందులు పంపిణీ చేశారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, ఎంపీఓ ప్రసాద్, పీహెచ్‌ఎస్ నీరజ, హెల్త్ అసిస్టెంట్ అడప రాజరమణయ్య, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

భూపాలపల్లి అర్బన్: మద్యం తాగి జిల్లాకేంద్రంలో వాహనం నడుపుతూ పట్టుబడిన కేసులో ఒకరికి జైలు శిక్ష పడినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సుభాష్‌కాలనీకి చెందిన అల్వాల వంశీ ఇటీవల మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడగా కోర్టులో ప్రవేశపెట్టారు. రెండు రోజుల జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

గుడుంబా పట్టివేత

కాటారం: మండలంలోని ఆదివారంపేటలో ఓ మహిళ గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దుర్గం లక్ష్మి ఇంట్లో తనిఖీ చేయగా 10 లీటర్ల గుడుంబా లభించినట్లు ఎస్సై పేర్కొన్నారు. గుడుంబా స్వాధీనం చేసుకుని లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా గుడుంబా తయారీ, రవాణ, విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కాటారం: మండలంలోని విలాసాగర్ మానేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ సిబ్బంది విలాసాగర్, గంగారం గ్రామాల మధ్య పెట్రోలింగ్ నిర్వహిస్తూ గంగారం క్రాస్ వద్ద ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను నిలిపి పత్రాలు అడిగారు. ఇసుక రవాణాకు సంబంధించి అనుమతి పత్రాలు లేకపోవడంతో పాటు వాహన పత్రాలు, డ్రైవర్‌కు లైసెన్స్ లేనట్లు గుర్తించారు. దీంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

గోదావరి పరిసర ప్రాంతాల్లో సర్వే



కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో గోదావరి నీటి ప్రవాహంపై కేంద్ర జలశక్తి శాఖ(సీడబ్ల్యూసీ)ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. మంగళవారం సర్వే జేఈఈ సందీప్ ఆధ్వర్యంలో సర్వే బృందం గోదావరి, పరిసర ప్రాంతాల్లో సర్వే చేశారు. ప్రతి వర్షాకాలంలో గోదావరిలో వరదల కారణంగా కోతకు గురైన ప్రాంతాన్ని సర్వే చేస్తున్నారు. వర్షాకాలంలో ఎంత మేర నీటిమట్టం ప్రవహిస్తుంది, కోతకు గురైన తరువాత ఎంత మేర ప్రవహిస్తుందనే హెచ్చుతగ్గులను సర్వే చేసి వర్షాకాలంలో దీని ఆధారంగా నీటి లెక్కలను సీడబ్ల్యూసీ అధికారులు చెబుతారని ఆయన వివరించారు. ఆయన వెంట సర్వే బృందం ఉన్నారు.

పనికి రావట్లే..

కరువు పనిపై పెరుగుతున్న ఆంక్షలు



- నిలిచిన వేసవి భత్యం
- కేంద్రం కొత్త సాఫ్ట్‌వేర్‌తో అందని అదనపు కూలి
- కూలీల అలవెన్స్ హుష్‌కాకి
- ఉపాధి పనులపై కూలీల విముఖత

కాటారం: గ్రామాల్లో వలసలు తగ్గించి స్థానికంగానే ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన జాతీయ ఉపాధిహామీ పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకంపై విధి విధానాలు మారుస్తుండడంతో క్షేత్రస్థాయిలో పథకం అమలు తీరు అగమ్యగోచరంగా మారిపోయింది. గతంలో ఉపాధి పనులను పూర్తిస్థాయిలో వినియోగించుకున్న కూలీలు ప్రస్తుతం పనుల పట్ల పూర్తిస్థాయి విముఖత చూపిస్తున్న పరిస్థితి నెలకొంది. కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్ కారణంగా ఉపాధి పనులపై పెరిగిన ఆంక్షలతో గ్రామాల్లో పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. జిల్లాలోని మొత్తం కూలీలలో కనీసం 10శాతం కూలీలు కూడా ఉపాధి పనులకు రావడం లేదు.

వేసవి భత్యం ఊసేలేదు..

వేసవికాలం దృష్ట్యా గతంలో ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఐదు నెలల పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఉపాధి కూలీలకు 20శాతం అదనపు వేసవి భత్యం ఇచ్చేది. రెండేళ్ల వేసవి భత్యం నిలిచిపోగా ఈసారి కూడా వేసవి భత్యం అందేలా లేదు. దీంతో కూలీల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ఉపాధి పనిదినాలు పెంచేందుకు ఏటా రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు అదనపు భత్యాన్ని అందజేసేది. దీంతో పనిచేసిన కూలీలకు ఆ రోజు పొందే కూలీలో ఫిబ్రవరి నెలలో 20శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30శాతం, జూన్‌లో 20శాతం అదనపు భత్యం చెల్లిస్తుండేవారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గతంలో వినియోగించిన సాఫ్ట్‌వేర్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. కేంద్ర ప్రభుత్వం నూతనంగా నేషనల్ ఇర్మమెటిక్స్ సెంటర్(ఎన్‌ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. దీంతో మూడేళ్లుగా ఉపాధి చెల్లింపులు నేరుగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఐసీ ఆధ్వర్యంలోకి వెళ్లడంతో అందులో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే వీలు లేకుండా పోయింది. ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఒక రోజుకు గరిష్టంగా రూ.300 కూలీ చెల్లిస్తుంది. కూలీల వేతనాలు సైతం వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం వేసవి భత్యం ఇచ్చే అవకాశం లేకపోవడంతో వేసవిలో పనిచేసే కూలీల అలవెన్స్‌కు బ్రేక్ పడింది. దీనికి తోడు ఉపాధి పనులు జరిగే పని ప్రాంతంలో ఎండల తీవ్రత, వసతుల లేమి కారణాలతో పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గిపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లా వివరాలు..

మండలాలు	12
గ్రామపంచాయతీలు	241
గ్రామాలు	391
జాబ్‌కార్డులు	1,18,327
కూలీల సంఖ్య	2,42,172

పనులు ప్రారంభం..

జిల్లాలో 12 మండలాలు ఉండగా 241 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఇప్పటికే ఉపాధిహామీ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం హార్వేస్టింగ్ ఫండ్, నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్, మొక్కల పోషణ, నిర్వహణ, రైతుల చేలలో చిన్న కుంటల పూడికతీత కొనసాగుతున్నాయి. కానీ కూలీల హాజరు సంఖ్య ఆశించిన స్థాయిలో మాత్రం మాత్రం ఉండటం లేదు.

రెండేళ్లుగా అందడం లేదు..

వేసవి కాలంతో ఉపాధి పనులు చేసిన కూలీలకు రెండేళ్ల నుంచి వేసవిభత్యం నిలిపివేశారు. ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటి వరకు సమాచారం అందలేదు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉండే సాఫ్ట్‌వేర్ ద్వారా వేసవి భత్యం ఇచ్చేవారు. కేంద్ర ప్రభుత్వం నూతన సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో వేసవి భత్యం నిలిపివేశారు. గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- నరేశ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి

రోజుకో చోట..

పలుగుల అటవీప్రాంతంలో పెద్దపులి..

- 10రోజులుగా కాటారం, మహదేవపూర్ అడవుల్లో తిష్ట
- ట్రాకింగ్ కెమెరాలకు చిక్కని టైగర్
- అటవీశాఖ అధికారులకు ముప్పతిప్పలు

కాటారం/కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామ అటవీప్రాంతంలో మంగళవారం పెద్దపులి కనిపించింది. పదిరోజులుగా పెద్దపులి కాటారం, మహదేవపూర్ అడవుల్లో తిష్టవేసి అటవీశాఖ అధికారులకు కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. ఫిబ్రవరి 10న కాటారం మండలం నస్తూర్‌పల్లి శివారులో ఓ రైతు పులి పాదముద్రలు(పగ్‌మార్క్) చూసి భయాందోళనకు గురయ్యాడు. మహదేవపూర్ మండలం అన్నారం, బీరాసాగర్, కుదురుపల్లి అడవిలో రెండు రోజులు సంచరించింది. దీంతో అటవీశాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లో ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పులి మాత్రం కెమెరాల్లో చిక్కడం లేదని అటవీశాఖ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు.

ట్రాకింగ్ కెమెరాలకు చిక్కకుండా..

నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలు(ఫ్లగ్ మార్క్స్) గుర్తించిన అటవీశాఖ అధికారులు పులి కదలికలపై దృష్టి సారించారు. మొదటి రోజు కాటారం, మహదేవపూర్ రేంజ్ పరిధిల్లోని అటవీ ప్రాంతం మొత్తాన్ని అధికారులు, సిబ్బంది జల్లెడ పట్టారు. పులి ఆనవాళ్లు కానరాకపోవడంతో నస్తూర్‌పల్లి, వీరాపూర్, అన్నారం, బీరాసాగర్, మహదేవపూర్ అటవీప్రాంతాల్లో యానిమల్ ట్రాకర్ నిపుణులతో కలిసి ట్రాకింగ్ కెమెరాలు



అటవీ ప్రాంతంలో గాలిస్తున్న అటవీశాఖ అధికారులు

ఏర్పాటు చేశారు. ఆరు బృందాలుగా విడిపోయి అటవీశాఖ అధికారులు పులి జాడను కనుక్కునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయినప్పటికీ పులి ఎక్కడ కూడా ట్రాకింగ్ కెమెరాలకు చిక్కకుండా సంచరిస్తుంది.

భయాందోళనలో ప్రజలు..

పెద్దపులి రోజుకో చోట కనిపిస్తుండటంతో అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పులి ఎప్పుడు ఎక్కడికి వస్తుందో తెలియని భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. రాత్రి సమయంలో అటవీ ప్రాంతానికి సమీపంలోని పంట పొలాల వద్దకు వెళ్లడానికి రైతులు జంకుతున్నారు.

ఆందోళనకు గురికావద్దు..

పులి సంచారం పట్ల ప్రజలు, రైతులు ఆందోళనకు గురికావద్దని, కాటారం రేంజ్ అధికారిణి స్వాతి, అటవీశాఖ రేంజర్ రవికుమార్ తెలిపారు. రాత్రి సమయాల్లో అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని సూచించారు. పులి, పులి ఆనవాళ్లు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.



గారెకుంటలో నీరుతాగి..

మంగళవారం ఏకంగా మహదేవపూర్ మండలం పలుగుల ఎస్సీకాలనీ పక్కన నీలగిరి వనంలో పులి సంచారం చేసింది. అదేగ్రామానికి చెందిన నిట్టూరి బాపు అనే రైతు ఎడ్లబండితో పత్తిచేనుకు వెళుతున్నాడు. కొంత దూరం నడిచిన ఎద్దులు ముందుకు నడిచేందుకు వెనుకడుగు వేశాయి. రైతు ఎద్దులను దబాయించినా ముందుకు సాగలేదు. దీంతో రైతు పరీక్షించి చూడడంతో ముందు పెద్ద పులి నడుచుకుంటూ వెళ్తోంది. దీంతో రైతు భయానికి గురై వెంటనే ఎడ్ల బండిని వెనుకకు తిప్పి ఇంటికి చేరుకున్నాడు. గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులకు తెలిపారు. అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పులికోసం చెట్టు, పుట్ట, వాగు, వంకల్లో ముమ్మరంగా అన్వేషించారు. గారెకుంట పోచమ్మ కుంట వద్ద పులి నీరుతాగి వెళ్లినట్లు పాదముద్రలను అధికారులు సేకరించారు. అక్కడి నుంచి కాళేశ్వరం వైపున నల్లవాగుకు చేరినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

భోజన సౌకర్యం మెరుగుపరచాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, సంక్షేమ గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహారం, భోజన సౌకర్యాల అమలును మరింత మెరుగుపరిచేందుకు మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులతో మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని మండలాల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాల్లో భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఇదొక నిరంతర ప్రక్రియగా జరగాలన్నారు. ఆహార పదార్థాల శుభ్రత, పోషక విలువలు, వంట గదుల నిర్వహణ, భోజన పరిమాణం, మెనూ అమలు తదితర అంశాలను గమనించి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తొద్దు..

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా సమగ్ర కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. హైదరాబాద్ నుంచి మంగళవారం వివిధ అంశాలపై ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలోని 53 సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. క్రమం తప్పక వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తాగునీటి కొరత వచ్చిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, స్థానిక వనరులను గుర్తించాలని తెలిపారు. లీకేజీలు అరికట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి





సమావేశంలో సూచనలు చేస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే, హాజరైన పోలీసు అధికారులు

- విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి
- ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల విచారణ, స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్షించారు. కేసుల దర్యాప్తులో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలు, నేర స్థల పరిశీలన, సాక్ష్యాధారాల సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, చార్జిషీటు దాఖలు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు విజిబుల్ పోలిసింగ్‌కు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రామ సందర్శనలు, పట్టణంలో వార్డుల సందర్శనలు పెంచాలన్నారు. స్థానికంగా ఉండే ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా చూసుకోవాలని చెప్పారు. జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్ట నిఘా ఏర్పాటుచేయాలని ఆదేశించారు. మహిళల పట్ల జరిగే నేరాలపై వేగంగా స్పందించి న్యాయం చేయాలన్నారు. వివిధ దొంగతనాల కేసుల్లో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, వర్టికల్ డీఎస్పీ నారాయణనాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి

డీఈఓ రాజేందర్



చిట్యాల: విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

చిట్యాల: టెన్త్ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ అన్నారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలను డీఈఓ సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని అత్యుత్తమ మార్కులు సాధించాలని కోరారు. సెక్టోరియల్ ఆఫీసర్ రాజగోపాల్ విద్యార్థులను వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలను అడిగి జవాబులు తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజమౌళి, నీలిమారెడ్డి, విజయలక్ష్మి, కల్పన, మౌనిక, ఉస్మాన్ అలీ, ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

మొగుళ్లపల్లి: పదిలో జీపీఏ సాధనే లక్ష్యంగా ప్రతీ విద్యార్థి శ్రద్ధగా చదవాలని డీఇఓ రాజేందర్ అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మొట్లపల్లి, పిడిసిల్ల, ముల్కలపల్లి పాఠశాలలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, విద్యార్థుల ప్రగతి రికార్డులను, ఉపాధ్యాయుల డైరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. టెన్త్ విద్యార్థులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకొని సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు. డీఈఓ వెంట జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు పింగిలి విజయపాల్ రెడ్డి, నరసింహస్వామి, శ్రీనివాస్, మహేష్, కోటేశ్వర్, శ్రీమంజరి, వెంకన్న, అనిల్‌కుమార్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ

కాటారం: ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో కాటారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మంగళవారం ఆన్‌లైన్ పద్ధతిలో రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. గతంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన మణిదీప్, అలేఖ్య, అభిరాంకళ్యాణ్ ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. అనంతరం విద్యార్థులను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా దేశానికి సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉమారాణి, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గండు రాజబాబు, ఉపాధ్యాయులు రాజేందర్, రాజయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్



క్రిష్ణాకాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ వెల్లడించారు. పట్టణంలోని పలు కాలనీల నుంచి మంగళవారం ఫిర్యాదులు అందగా అప్పటికప్పుడు మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. కాశీంపల్లిలో ఒక చేతిపంపు మరమ్మతు, క్రిష్ణాకాలనీ, ఎల్‌బీ నగర్‌లలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు, గడ్డిగానిపల్లిలో బోరు మోటారు కాలిపోతే అప్పటికప్పుడు రిపేరు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. తాగునీటి సమస్య ఏర్పడితే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

నేడు తిరుగువారం పండుగ

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో సమ్మక్క–సారలమ్మ పూజారులు నేడు (బుధవారం) తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు. అమ్మవార్ల ఆలయాలను శుద్ధి చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవార్ల వస్త్రాలు, పూజా సామగ్రిని భద్రపరుస్తారు. అమ్మవార్లకు యాట నైవేద్యంగా సమర్పించనున్నారు. తిరుగువారం పండుగ రోజు పూజారుల కుటుంబీకులు, స్థానిక గ్రామస్తులు ఇళ్లను శుద్ధి చేసుకొని మొక్కులు చెల్లించుకోనున్నారు. తిరుగువారం పండుగతో మినీజాతర (మండమెలిగె) పండుగ పూజా కార్యక్రమాల ముగియనున్నాయి.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం



కెపాసిటర్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

ములుగు రూరల్: విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి సర్కిల్ డీఈఈ(టెక్నికల్) వెంకటేశం, ములుగు డీఈఈ నాగేశ్వర్‌రావు సూచించారు. ఈ మేరకు మండల పరిధిలోని జగ్గన్నపేట రైతులకు మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కెపాసిటర్లు బిగించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. విద్యుత్ పరికరాలను తడి చేతులతో ముట్టుకోకూడదని, చార్జింగ్ పెడుతూ ఫోన్ మాట్లాడకూడదని సూచించారు. విద్యుత్ సర్వీస్ వైరు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. వ్యవసాయ కనెక్షన్ల క్రమబద్ధీకరణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఏడీఈ వేణుగోపాల్, ఏఈ బానోత్ రవి, ఏఎల్‌ఎం కమలాకర్ పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఏటూరునాగారం: సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని పీఎం ఎస్‌ఆర్‌ఐ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ లక్ష్మణ్ తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 130 మంది మంగళవారం హనుమకొండలోని ఎన్‌ఐటీ యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య, శాస్త్రీయ విద్య పెంపొందించేందుకు స్టెమ్ సంస్థ ద్వారా స్టడీ టూర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించామని వివరించారు. ఈ టూర్‌లో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యాశాఖ ఫోరం రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నేతలు

విద్యారణ్యపురి: టీఎస్‌జీఓఎస్ పాఠశాల విద్యాశాఖ ఫోరం రాష్ట్రస్థాయి కార్యవర్గం ఎన్నికలు ఈనెల 17వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించారు. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు పలు పదవులు దక్కాయి. హనుమకొండ జిల్లా విద్యాశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఫకృద్దీన్ అహ్మద్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భరత్, కోశాధికారిగా జనగామ నుంచి పవన్‌బాబు, కార్యవర్గ సభ్యుడిగా వరంగల్ జిల్లా నుంచి ఎస్‌బీ శ్రీనివాస్, భూపాలపల్లి విద్యాశాఖలో పని చేస్తున్న దిలీప్‌కుమార్ పబ్లిసిటీ సెక్రటరీగా, ప్రశాంత్‌కుమార్ సభ్యుడిగా ఎన్నికయ్యారని బాధ్యులు మంగళవారం తెలిపారు.

సాఫ్ట్‌వేర్ లోపాలతో పత్తి కొనుగోళ్లలో అంతరాయం

- సీసీఐ సీజీఎం పాణిగ్రహి



వరంగల్: రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు చెందిన తక్‌పట్టీ సాఫ్ట్‌వేర్‌లో నెలకొన్న లోపాల కారణంగా ఫిబ్రవరి 9వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లలో అంతరాయం కలుగుతోందని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీసీఐ) సీజీఎం(మార్కెటింగ్)ఎస్‌కే.పాణిగ్రహి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నియమించిన థర్డ్‌పార్టీ డేటా సెంటర్‌లో తీవ్ర నెట్‌వర్క్ అంతరాయంతో ఈ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. నెట్‌వర్క్ వ్యవస్థ పునరుద్ధరించిన వెంటనే సీసీఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేస్తామని, రాష్ట్రంలో చివరివరకు వచ్చే పత్తిని ఎంఎస్‌పీతో కొనుగోలు చేస్తుందని రైతులకు హామీ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- కాపాడబోయిన మహిళకు తప్పిన ప్రాణాపాయం



సోమయ్య (ఫైల్)

దేవరుప్పుల : దండెంపై దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందగా, అతడిని కాపాడబోయే క్రమంలో ఓ మహిళకు ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ ప్రాంతంలో ఉంటున్న నర్ర సోమయ్య(47) ఉదయం స్నానం చేసి దుస్తులు దండెంపై ఆరేస్తున్నాడు. ఈక్రమంలో అతుకులు ఏర్పడిన విద్యుత్ వైరు దండేనికి తగిలింది. దీనిని గమనించని నర్సయ్య దండెన్ని పట్టుకోగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్‌షాక్‌తో విలవిలాడుతున్న సోమయ్యను కాపాడేందుకు వచ్చిన స్థానికురాలు రాధిక.. మీటర్ ఆఫ్ చేసినా విద్యుత్ సరఫరా బంద్ కాలేదు. ఈ క్రమంలో మీటర్ బంద్ చేశాను కున్న ఆ మహిళ.. దండెంపై వైరు తీసే క్రమంలో విద్యుత్‌షాక్ తగలగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇంతలో స్థానికుడు కందుల భిక్షపతి వచ్చి విద్యుత్ మీటర్ ఫ్యూజ్‌లు తీయడంతో రాధికకు ప్రాణాపాయం తప్పింది. ఈ విషయమై సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు ఘటనా స్థలిని పరిశీలించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆకు కూరలతో అధిక ఆదాయం..



కొత్తిమీర



పాలకూర



మెంతికూర



తోటకూర

- వేసవిలో తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి, లాభాలు
- మల్యాల కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త రాంబాబు
- రైతులకు సలహాలు, సూచనలు



మహబూబాబాద్ రూరల్: వేసవిలో ఆకుకూరల సాగుతో అధిక ఆదాయం పొందొచ్చు. తక్కువ సమయం, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు అర్జించొచ్చు. ఈ క్రమంలో వేసవిలో ఆకు కూరల్లో ఏ రకం సాగు చేపట్టాలి? ఏ నేలలు అనుకూలం? ఎలా పండించాలనే విషయాలను మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు.. రైతులకు వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- ఆకు కూరల్లో పాలకూర, తోటకూర, పుదీన, మెంతికూర, గోంగూర, కొత్తిమీర, కరివేపాకు ప్రధానమైనవి.
- ఆకు కూరల్లో లవణాలు, విటమిన్లు, మాంసకృతు లు, పీచు పదార్థం ఎక్కువ ఉండడంతో వేసవిలో ఆకు కూరలకు డిమాండ్ ఉంటుంది.
- తక్కువ కాలం, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంట కావడంతో ఆకు కూరల సాగు బహుప్రయోజనకరంగా ఉంటుంది.

ఆకు కూరలసాగుకు నేల తయారీ ముఖ్యం..



- ఆకు కూరలు సాగుచేసే భూమిని నాలుగు, ఐదుసార్లు దున్ని, మట్టి పెల్లలు లేకుండా చూసుకోవాలి.
- ఆఖరి దుక్కిలో ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు, 300 కిలోల వేప పిండి, 100 కిలోల సూపర్ పాస్పేట్, 10 కిలోల జింకు సల్ఫేట్, 100 కిలోల ట్రైకోడెర్మా, 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లు వేసి ఆకు, విత్తనాలను విత్తుకోవాలి.

ముఖ్య విషయాలు..

- ఆయా ప్రాంతాలకు అనువైన సాధారణ రకాలు, హైబ్రిడ్ రకాలను వేసుకోవచ్చు.
- తోట కూర విత్తనాలు చిన్నగా ఉంటాయి. అందుకే ఇసుకతో కలిపి చల్లుకోవాలి. ఎకరానికి 800 గ్రాముల విత్తనం సరిపోతుంది.
- పాల కూర విత్తన బంతిలో 2 నుంచి 3 రకాల విత్తనాలు ఉంటాయి. విత్తనాలను మూడు నుంచి నాలుగు సెంటీమీటర్ల లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువైతే మొలక సరిగా రాదు.
- ధనియాలను (కొత్తిమీర పంట) విత్తే సమయంలో రెండు సాల్లుగా చేయాలి. లేదంటే గింజలు ఆలస్యంగా మొలకెత్తి, మొలక శాతం బాగా తగ్గిపోతుంది. ఇందుకు గింజలను నేలపై పోసి చెప్పులు వేసుకుని కాళ్లతో సున్నితంగా రుద్దాలి. ఎకరానికి నాలుగు నుంచి ఐదు కిలోల విత్తనం సరిపోతుంది.
- కరివేపాకు విత్తనాలను చెట్టుకు ఉండే పండు నుంచి వేరు చేసిన వెంటనే విత్తుకోవాలి. ఆరితే మొలక శాతం తగ్గుతుంది.
- విత్తన శుద్ధికి జీవ శిలీంధ్రనాశిని ట్రైకోడెర్మా 8 గ్రాములను కిలో విత్తనానికి పట్టించి విత్తితే వేరుకుళ్లు ఆశించవు.
- విత్తనం విత్తిన 48 గంటల లోపు భూమిలో తేమను చూసి లీటర్ నీటికి 4 మిల్లీ లీటర్ల పెండి మిథాలిన్ కలుపు మందును పిచికారీ చేయొచ్చు.
- పైపాటుగా పంట ఎదుగుదలకు లీటర్ నీటికి 5 గ్రాముల 19:19:19 పాలిఫీడ్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- పంటకు అవసరం మేరకు నీరు అందించాలి. నీరు ఎక్కువ అయితే వేరు కుళ్లు, కాండం కుళ్లు వచ్చే అవకాశం ఉంది. స్ప్రింక్లర్ల ద్వారా నీరు అందించడం మంచిది. దీని వల్ల ఆకులపై ఉండే పురుగులు, నల్లులు, దుమ్ము, ధూళి రాలిపోతాయి.

సస్యరక్షణ..

- పేనుబంక, ఆకు ముడత, ఆకులను తినే గొంగళి పురుగులు ముఖ్యంగా ఆశిస్తాయి. వాటి నివారణకు రసాయన మందులను వాడకుండా వేప సంబంధిత మందులు వాడడం మంచిది. రసాయన మందులు వాడితే కనీసం వారం రోజుల తరువాత పంట కోయాలి.
- కత్తిరించే ఆకు కూర పంటలకు, కోత తర్వాత ఎకరాకు 10 కిలోల యూరియా వేస్తే మళ్లీ పంటకు వస్తుంది.
- ఆకులను మార్కెట్‌కు తరలించే సమయంలో గోనె సంచులకు బదులు కట్టలుగా కట్టి గాలి ప్రసరించే ట్రేలలో రవాణా చేయడం మంచిది.

స్వచ్ఛమైన పెట్రోల్ అందిస్తాం



మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా



వాహనంలో పెట్రోల్ పోస్తున్న సౌమ్య మిశ్రా

- వాహనదారులు వినియోగించుకోవాలి
- రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా
- జైళ్ల శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభం

ఖిలా వరంగల్: జైళ్ల శాఖ ద్వారా స్వచ్ఛమైన పెట్రోల్, డీజిల్ అందిస్తామని, దీనిని వాహనదారులు వినియోగించుకోవాలని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ (డైరెక్టర్ జనరల్) డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. మంగళవారం మామునూరు సెంట్రల్ జైలు ప్రాంగణంలోని తిమ్మాపురం రోడ్డుపై వరంగల్ సెంట్రల్ జైలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం. సంపత్, కలెక్టర్ సత్యశారద, జైలు సూపరింటెండెంట్ కళాసాగర్, జైలర్ పూర్ణచందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ వాహనదారులకు నాణ్యతతో కూడిన పెట్రోల్, డీజిల్ అందించాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు జైలు సిబ్బంది.. డీజీ సౌమ్య మిశ్రాకు గౌరవ వందనం చేశారు. అనంతరం జైలు ప్రాంగణంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఖైదీలను కలిశారు. ఈ సందర్భంగా 14 ఏళ్ల శిక్ష పూర్తయిన వారికి క్షమాభిక్ష ప్రసాదించాలని పలువురు ఖైదీలు డీజీని కోరారు.

చిందుబాగోతం.. ప్రాచీన జానపద కళారూపం

- పద్మశ్రీ గడ్డం సమ్మయ్య



కళాకారులను సన్మానిస్తున్న సుధాకర్, సమ్మయ్య

పాలకుర్తి టౌన్ : తెలుగు జానపద కళారూపాల్లో చిందు బాగోతం ప్రముఖమైందని చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య అన్నారు. ఇండస్ బుక్ ట్రస్ట్ నిర్వాహకుడు అరూరి సుధాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మంగళవారం మండల కేంద్రంలోని సుధా టెక్నో స్కూల్ ఆవరణలో యక్షగాన నాటక ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. చిందు యక్షగాన పౌరాణిక కథలతోపాటు పలు సామాజిక అంశాలపై చిందు కళాకారులు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, గడ్డం శ్రీనివాస్, గడ్డం సంజీవ, గడ్డం రఘుపతి, సోమరాజు బృందాలు ప్రదర్శనలిచ్చాయి. అనంతరం పద్మశ్రీ గడ్డం సమ్మయ్యతో కలిసి డాక్టర్ సుధాకర్ కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిందు యక్షగానం పురాణ గాథలను ప్రజలకు చేరవేసే వినోదాత్మక నాటకమన్నారు. శతాబ్దాలుగా చిందు కళాకారులు ఈ కళకు జీవం పోస్తున్నారని తెలిపారు.

సుమతిరెడ్డి మహిళా కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

- ఎస్‌ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ ఎనగందుల వరదారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వరదారెడ్డి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి స్వయం ప్రతిపత్తి హోదా లభించిందని ఎస్‌ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ కాకాజీకాలనీలోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ముఖ్య నగరాల్లోని కళాశాలలకు దీటుగా సుమతిరెడ్డి కళాశాలలో విద్యార్థినులను అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. తమ ఇంజనీరింగ్ కళాశాలలో చదువు పూర్తి చేసిన విద్యార్థినులు దేశ, విదేశాల్లోని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అటానమస్ హోదాతో తమ కళాశాల కీర్తి మరింత పెరుగుతుందన్నారు. సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి హోదాతో కళాశాలకు అకడమిక్ మెరుగుదల, సాంకేతిక అభివృద్ధి, కళాశాల అభ్యున్నతి జరుగుతుందన్నారు. విద్యార్థినుల వ్యక్తిగత అభివృద్ధి, సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రపంచ స్థాయిలో ఉద్యోగ, వ్యాపారవేత్తలుగా నిలపడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కళాశాల వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ. సుదర్శన్, డాక్టర్ కె. మహేందర్, డాక్టర్ ఎన్. శ్రీవాణి, ఏట వేణుగోపాలస్వామి, అధ్యాపక బృందం, విద్యార్థినుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అటానమస్ హోదాకు అంకితభావంతో పనిచేసిన ఎస్‌ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి ఎ. మధుకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీరెడ్డిని వరదారెడ్డి అభినందించారు.

ప్రశ్నించే నాయకుడిని ఎన్నుకోవాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మహబూబాబాద్ అర్బన్/మరిపెడ/గూడూరు: చట్టసభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే నాయకుడిని ఎన్నుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మానుకోటలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. 14 నెలల పాలనలో హామీ లు అమలు చేయక ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ 317 జీఓ ద్వారా వేలాది మంది టీచర్ల జీవితాలను ఛిన్నాభిన్నం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు, 317 జీఓ రద్దు ,6 నెలల్లో కొత్త పీఆర్సీ, డీఏ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి మరిచిపోయిందని మండిపడ్డారు. కాగా, బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎంపీటీసీ సోమ్లా నాయక్, కాంగ్రెస్ నుంచి పల్స రవీందర్‌ను బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ అజ్మీరా సీతా రాంనాయక్, నాయకులు యాప సీతయ్య, భూక్య సంగీత, బాలరాజు, భాస్కర్‌రెడ్డి, రా మచందర్‌రావు, సుధీర్‌రెడ్డి, శ్యాంసుందర్‌శర్మ, గో వర్ధన్‌రెడ్డి, సతీశ్, వెంకన్న, మురళి, సురేందర్, మహేశ్, మోతీలాల్, నర్సింహారెడ్డి, అశోక్, సంపత్, సందీప్, అజయ్ పాల్గొన్నారు. అనంతరం మరిపెడ హైస్కూల్, గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని కస్తూర్బా విద్యాలయంలో స రోత్తం రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. మొ దటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఆయాపాఠశాల్లో నిర్వహించిన ప్రచారంలో నాయకులు మహేశ్‌గౌడ్, జనార్దన్, రమేశ్, సురేందర్, పార్టీ గూడూరు అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

- కరీమాబాద్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..

ఖిలా వరంగల్ : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. కరీమాబాద్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన బొల్లు రాకేశ్ (25) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. స్నేహితుడి పెళ్లి నిమిత్తం శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి ఇంటికి చేరుకున్నాడు. సాయంత్రం పెళ్లికి వెళ్లిన రాకేశ్ ఆదివారం ఉదయం విగతజీవిగా కనిపించాడని తల్లి రజిత మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రాకేశ్ మృతిపై అనుమానాలు ఉన్నాయని, మెడపై గాయాలు ఉన్నాయని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేసినట్లు తెలిసింది. పోస్టుమార్టం అనంతరం తల్లి రజితకు సోమవారం సాయంత్రం మృతదేహాన్ని అప్పగించారు. వైద్యుల నివేదిక ఆధారంగా దర్యాప్తు కొనసాగుతుందని, ప్రస్తుతం అనుమానాస్పద కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

భవిష్యత్‌లో మానవ రహిత వ్యవసాయం

- ప్రకృతి వనరులను కాపాడుకోవాలి
- నూతన ఆవిష్కర్తలకు అగ్రి హబ్ దోహదం
- జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య



మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య

హన్మకొండ : భవిష్యత్‌లో మానవ రహిత వ్యవసాయ సాగు పద్ధతులు రావొచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ అల్దాస్ జానయ్య పేర్కొన్నారు. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అగ్రి హబ్‌ను నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జానయ్య మాట్లాడుతూ.. ఇప్పటికే డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు చల్లడం వంటివి చేస్తున్నామని వివరించారు. రాబోయే రోజుల్లో రోబోల సాయం పొందే అవకాశాలున్నాయని తెలిపారు. రోబోలు వస్తే మానవ ప్రమేయం లేకుండా వ్యవసాయ పనులు చేసుకోవచ్చన్నారు. వ్యవసాయం ఎప్పుడూ సంక్షోభంలో చిక్కుకోలేదని, చిక్కుకుంది రైతులు మాత్రమే అని ఉద్ఘాటించారు. వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుంటే కాలగర్భంలో కలిసి పోవాల్సిందేనని వెల్లడించారు. విద్య, వైద్యం ప్రైవేట్ రంగంలోకి రావడంతో రైతులకు ఖర్చులు పెరిగాయని, వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం మినహా రైతుకు ఇతర ఆదాయం ఉండదని చెప్పారు. చైనాలో వ్యవసాయ పారిశ్రామికీకరణ, గ్రామీణ పారిశ్రామికీకరణ జరిగి దేశం అభివృద్ధి చెందిందని వివరించారు. దేశంలో గ్రామీణ ప్రాంత నూతన ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు అగ్రి హబ్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ క్రమంలోనే వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నాబార్డు సాయంతో అగ్రి హబ్ ఏర్పాటు చేశామని అన్నారు. నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఆవిష్కర్తలకు అందుబాటులో ఉండేలా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అగ్రిహబ్ ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ రంగానికి పనికి వచ్చే పనిముట్లు తీసుకు రావాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఈ దిశగా ఔత్సాహికులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. దేశంలో ఏడు ఇంక్యుబేషన్ సెంటర్లు ఉంటే తెలంగాణలో రెండు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలతో పరస్పర అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకుడు డాక్టర్ బలరాం, అగ్రి హబ్ ఎండీ డాక్టర్ ఆర్.కల్పనా శాస్త్రి, సీఈఓ విజయ్, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వెంకటరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారులు అనురాధ, రవీందర్ సింగ్, శాస్త్రవేత్తలు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలకు వెళ్లి వచ్చేలోగా..

- తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ
- 10.50 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.88 వేల నగదు అపహరణ
- మహబూబాబాద్‌లో ఘటన



దొంగలు పగుల గొట్టిన బీరువా

మహబూబాబాద్ రూరల్ : వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వెళ్లి వచ్చేలోగా ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో 10.50 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.88 వేల నగదు అపహరణకు గురైంది. మహబూబాబాద్‌లో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ కాలనీలో నివాసముండే మహబూబ్ అలీకి ఆరోగ్యం బాగాలేకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం ఈ నెల 10వ తేదీన హైదరాబాద్ వెళ్లారు. తిరిగి కుటుంబ సభ్యులు ఈ నెల 17వ తేదీన సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపు తాళం పగులగొట్టి ఉంది. దీంతో అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తొలగించి ఉన్నాయి. అందులోని 10.50 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.88 వేల నగదు కనిపించలే దు. దీంతో చోరీ జరిగిందని భావించిన మహబూ బ్ అలీ, అలీ మాబీ దంపతులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ ఎస్సై శివ ఘటనా స్థలిని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాల ఉత్పత్తిలో భారత్ మొదటిస్థానం

- కేవీకే కోఆర్డినేటర్ రాజన్న



సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రాజు

మామునూరు : పాల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ మొదటి స్థానంలో ఉందని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న పేర్కొన్నారు. మంగళవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో గృహ, విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణాజ్యోతి, సౌమ్య ఆధ్వర్యంలో విలువ ఆధారిత పాల ఉత్పత్తులపై శిక్షణ నిర్వహించగా రాజన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాల ఉత్పత్తులను కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని అధిక లాభాలను పొందవచ్చని సూచించారు. పాల ఉత్పత్తి, ఆదాయ మార్గాలపై డాక్టర్ అరుణాజ్యోతి రైతులకు అవగాహన కల్పించారు.

కేవీకేను సందర్శించిన విద్యార్థులు

మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని నర్సంపేట, దుగ్గొండి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎడ్యుకేషనల్ విజిట్ టూర్‌లో భాగంగా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కేవీకే అందించే సేవలు, చేపల పెంపకం, వర్మి కంపోస్ట్ తయారీ, ప్లాస్టిక్ మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు, అజోల్లా ఉపయోగాలు, సోలార్ వినియోగం, పెరటి కోళ్ల పెంపకం, వ్యవసాయ పనిముట్ల ఉపయోగాలపై శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాజన్న, సౌమ్య, రాజు, అరుణాజ్యోతి, గణేశ్, సాయికిరణ్, సాయిచంద్, శుశ్రుత్ పాల్గొన్నారు.

మార్చి చివరి వరకు సాగునీరు విడుదల!

- మరోసారి షెడ్యూల్ ప్రకటించిన 'ఇరిగేషన్'
- వరంగల్ అధికారులకు తాజా ఉత్తర్వులు
- ఎస్సారెస్పీ, దేవాదుల ఆయకట్టుపై ప్రకటన



సాక్షి ప్రతినిధి, వరంగల్ : యాసంగి సీజన్ పంటల సాగుకు నీటి విడుదలపై ఆ శాఖ మరోసారి స్పష్టత ఇచ్చింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో సాగునీటి విడుదల, ప్రాజెక్టులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే 2024, డిసెంబర్‌లోనే యాసంగి పంటలకు సాగునీరు విడుదల షెడ్యూల్ ప్రకటించిన అధికారులు, మంగళవారం ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిన నీరు విడుదల చేయనున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) స్టేజ్-1లో 7,99,470 ఎకరాల ఆయకట్టుకు యాసంగిలో నీరందించడం లక్ష్యం కాగా.. పాత ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల ఆయకట్టుకు ఈ నీరందనుంది. ఎస్సారెస్పీ స్టేజ్-2లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో స్థిరీకరించిన 3,36,630 ఎకరాలకు సాగునీరు విడుదల అవుతోంది. జె.చొక్కారావు గోదావరి ఎత్తిపోతల (దేవాదుల) పథకం ద్వారా 1,73,153 ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా చేయడం ఇరిగేషన్ లక్ష్యం కాగా.. పాకాల, రామప్ప, లక్నవరం సరస్సులు, మల్లూరు ప్రాజెక్టుల కింద మరో 24 ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి వరంగల్‌లోని వరంగల్ పశ్చిమ, తూర్పు, పరకాల, నర్సంపేట, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్, మహబూబాబాద్ నియోజక వర్గాలకు చెందిన సుమారు 3.31 లక్షల ఎకరాల్లో సాగు చేసిన ఈ యాసంగి పంటలకు నీరందుతుందని అధికారులు ప్రకటించారు. నీటి విడుదల మార్చి చివరి వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. 'శివం' సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు యాసంగి పంటలకు ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీరందించడం జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఇరిగేషన్ ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అలాగే జంగిల్ క్లియరెన్స్, మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీలు, తనిఖీల కోసం సేకరించిన కాల్వ వెడల్పులను సక్రమంగా నిర్వహించాలని, నీటి నియంత్రణ, విడుదల చేయడానికి ముందు అన్ని కీలకమైన ఆపరేషన్, మెంటనెన్స్ పనులకు హాజరు కావాలని ఆయన అధికారులను ఆదేశించారు. అన్ని కెనాల్ బ్యాంకింగ్ రీచ్‌లను నిశితంగా పరిశీలించాలని ఈఎన్‌సీలు, సీఈలకు సూచించారు. సీఎం ఆదేశాల మేరకు నీటి విడుదల జరుగుతుందని, కీలక సమయంలో సరిగ్గా నీటి వినియోగం జరగడానికి ఈఈలు రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించాలని ఈఎన్‌సీ అనిల్ ఆదేశించారు.

తల్లి చెంతకు ఆడశిశువు..

- అప్పగించిన అధికారులు



తల్లికి శిశువును అప్పగిస్తున్న అధికారులు

చెన్నారావుపేట: విక్రయానికి గురైన ఆడ శిశువు తల్లి చెంతకు చేరింది. చెన్నారావుపేట మండలం బాపునగర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఆడ శిశువు జన్మించిన కొద్దిరోజులకు విక్రయించింది. ఈ ఘటనపై ఈ నెల 16వ తేదీన 'ఆడ శిశువు అమ్మకం' అనే శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన చైల్డ్ వెల్ఫేర్ జిల్లా కమిటీ చైర్‌పర్సన్ వసుధ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించగా తన అనారోగ్య కారణంగా శిశువును బంధువుల ఇంటి వద్ద ఉంచినట్లు తల్లి తెలిపింది. అధికారులు వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం వారు శిశువును తీసుకుని రాగా అధికారులు శిశువును తల్లిదండ్రులకు అప్పగించారు. మరోసారి శిశువును విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మధు, సుజాత, రామలీల, షాహేద, మేగ్య, తదితరులు ఉన్నారు.